కథ

# పంజరం

వి.జె. ప్రసాద్

సహస్ర కిరణుడు ఆ రోజు తన ధర్మం నిర్వర్తించి విశ్రాంతి కోసం పడమటి పంజరంలోకి చేరుకున్నాడు.

'ఛీ! ఛీ! వెధవ బస్సు! ఎంత దుమ్మురేపిందో? మనుషులు కూడా ఈ రోడ్ల మీద ఉంటారన్న జ్ఞానం ఉండి చావదు. ఈ బస్సుల వాళ్ళకి! 'అని విసుక్కుంటూ, కళ్ల జోడు తీసి, దాన్ని కూడా దాటుకుని, కంట్లో పడ్డ నలకని తీసుకున్నాడు స్వరాజ్య మూర్తి. కళ్లజోడు సవరించుకుని, ఎదురుగాకనిపించిన గేటు విసురుగా తీసిలోపలకి అడుగు పెట్టేడు.

"భారతీ! మంచినీళ్లు తీసుకురా!" వరండాలో కుర్చీలో కూలబడుతూ అసహనంగా అరిచేడు, మంచి నీళ్లు అందించి, పైట చెంగుమెడచుట్టూ కప్పుకుని, మౌనంగా అలాగే నిలబడింది భారతి, భర్త అసహనానికి కారణాన్ని ఊహిస్తూ.

'అబ్బాయి, కోడలు ఇంట్లో లేరా! ఖాళీ చెంబు భార్యకి అందించి లోపలకు తొంగి చూస్తూ అడిగేడు స్వరాజ్యమూర్తి.

'పార్కుకి వెళ్లేరండీ! 'భయపడుతూ నెమ్మదిగా అంది, భారతి, కొడుకూ, కోడలు షికారుకి వెళితే. భర్త తరుచుగా చికాకు పడడం గమనించింది భారతి.

'భారతీ! మా అమ్మా నాన్న నాపేరు 'స్వరాజ్యమూర్తి' అని ఎందుకుపెట్టేరో నీకు తెలుసు కదా!" సూటిగా అడిగేడు స్వరాజ్యమూర్తి.

'తెలియకేమండీ! మనపెళ్లయిన దగ్గర్నుండి మీరు చెప్తూనే ఉన్నారు. నేను వింటూనే ఉన్నాను. మామగారు స్వాతంత్ర్యం కోసం కలలు కనేవారని అందుకే మీకు ఆ పేరు పెట్టేరని."

'పేరుపెట్టడమే కాదు భారతీ! నేను ఆడింది ఆట, పాడింది పాటగా నన్ను పెంచేరు. మనదేశానికి స్వతంత్రం వచ్చిన మూడేళ్లకి మన మధ్య మూడు ముళ్లబంధం ఏర్పడింది. అది అనుబంధంగా మారింది. మనవాడు ఈలోకంలో పడ్డాడు. వాడ్ని పెంచి, పెద్దచేసి ఒక ఇంటి వాడ్ని చేసాం! కొడుకు, కోడలు, మనవలతో శేష జీవితాన్ని ఆనందంగా గడుపుదామని ఆశించేం! ఆయాసం తీర్చుకోడానికి ఆగేడు స్వరాజ్యమూర్తి.

'బాగానే ఉన్నాం కదండీ! వాడు మనని ఎంతో అభిమానంగా చూసుకుంటున్నాడు. కోడలు స్వంత తల్లి లా నన్ను, తండ్రి కన్న ఎక్కువగా మిమ్మల్ని చూసుకుంటోంది." అందులో భర్త ఆవేశపడవలసిన విషయం ఏముందో అర్థంకాక ఆశ్చర్యంగా అంది భారతి.

'ఎందుకు చూసుకోవడంలేదూ, నీ కొడుకు మనల్ని అభిమానంగానే చూసుకుంటున్నాడు. నువ్వేమో వంటింటికి 'అంకితం' అయిపోతావే. మరి, నేను బజారు నుండిసామాన్లు తీసుకురావడానికీ, కరంటు బిల్లు కట్టడానికి, రేషను 'క్యూలో నిలబడడానికీ, అరవచాకిరీ చెయ్యడానికి అలవాటు పడిపోయేను. పోనీలే, ఆపని మనవాడి గురించి, మనవళ్ల గురించే కదా! అని సరిపెట్టుకుందాం! కాని చీకటి పడిన తరువాత అసలునరకం ప్రారంభం అవుతుంది. అబ్బాయి, మనవలు, కోడలు అర్థరాత్రి వరకూ పాటలు, సినిమాలు అంటూ ఆ టి.వి. డొక్కుకి అతుక్కుపోతారు. ఆ కేకలు, అరుపులతో పిచ్చెక్కించేస్తారు. అబ్బాయితో ఈ మాటే అంటే వాడునవ్వేసి, 'అలసి పోయిన శరీరాలకి, మనసులకీ అపాటి 'రిక్రియేషన్' ఉండాలి నాన్నా!' అంటూ నా మాట తేలిగ్గా కొట్టి పారేస్తాడు. నా కొడుకే నా మాట పట్టించుకోనప్పుడు నాకు స్వేచ్ఛ ఎక్కడ ఉంది? ఇన్నాళ్లూ స్వతంత్రంగా బ్రతికిన వాడ్ని! ఈ రాజీ బతుకు ఈడుస్తూ ఈ చట్రంలోనే నుండలేను భారతీ! ఈ మాట వాడితో ఈరోజే చెప్పేస్తాను. మన ఊరు వెళ్లి పోదాం! ఈ 'పంజరం' నుండి బయట పడి, స్వేచ్ఛగా బ్రతుకుదాం!" తన మనసులోని మాట చెప్పేసి, నిబ్బరంగా, కుర్చీలో వెనక్కి చేరబడ్డాడు స్వరాజ్యమూర్తి.

'భర్త గుండెల్లో బరువుని దించుకున్నాడు. ప్రస్తుతానికి ఆ భారం తను భరించవలసిందే!' అని ఆలోచిస్తూ "అబ్బాయికి చెప్తాం, లెండి!" అని అంటూ వంటింట్లోకి దారితీసింది భారతి.

తాత్కాలికంగా తేలికయిన మనస్సుతో స్వరాజ్యమూర్తి లేచి లోపలకు వెళ్లి కాళ్లు కడుక్కుని బట్టలు మార్చుకుని, వాలుకుర్చీలో కూలబడ్డాడు.

అబ్బాయికి ఇష్టమని మెంతివంకాయ కూర చేసింది భారతి. తాలింపు తయారవుతోంది. ఆమె మనసులో ఆలోచనల 'తాలింపు' ప్రారంభం అయింది.

ఆయన అన్నమాటల్లో నిజం లేకపోలేదు. ఈ నాటివరకూ పదిమందీ ఆయన చెప్పినమాట వినడమేగాని ఆయన ఎవరిచేతా చెప్పించుకోలేదు. ఆ ఊళ్లో ఆయన కెంత విలువ? ఈ వాతావరణంలో అనామకుడిగా బ్రతకాలంటే ... ఆయన ఎలా భరించ గలరు? తనే ఈ వాతావరణం భరించలేకపోతోంది. అయినా కన్నకడుపు తీపి' వలన ఆ చేదు దిగమింగుతోంది. 'మేమిద్దరం ఉద్యోగాలకి వెళ్లిపోతే, పిల్లల మంచి చెడ్డలు చూసుకోడానికి నా అన్నవాళ్లు ఎవరూలేరు. మీరు ఇక్కడికి వచ్చేస్తే, అందరం కలిసి ఉందాం!' అన్న అబ్బాయి ఉత్తరం చూసి, ఉన్నఊరు వదిలి కన్న కొడుకు దగ్గరకి తామిద్దరూ వచ్చి పడ్డారు. కొడుకూ, కోడలు తిండికి గుడ్డకు లోటు లేకుండా చూసుకుంటున్నారు. అయితే మనిషికి కావలసింది ఆ రెండేనా? కాదు... ఏదో లోపం! తన మట్టుకు తను తడి, మడి, ఆచారాలకి అలవాటుపడిపోయింది. ఇక్కడ టేబిల్‌మీల్స్ అంటూ, సొంటూ లేకుండా అన్ని చేతులూ పెట్టేసి ఎవరికి కావలసింది వాళ్లు వడ్డించుకుంటుంటే తన ప్రాణం విలవిలలాడిపోతోంది. వాళ్లని ఒప్పించలేక నొప్పించడం ఇష్టం లేక తనకీ, తన భర్తకీ వేరే వంట చేసి పెడుతోంది, తనే రాజీ పడలేక పోతుంటే, ఆయన ఎలాభరించగలరు?

అందుకే ఆయన తీసుకున్న నిర్ణయం మృష్టాన్నంలా అనిపించింది భారతికి.

తాలింపు పూర్తయ్యింది. కూరలో తాలింపు వేసి, కూరగిన్నె మీద మూత పెట్టి, అలసట తీర్చుకోడానికి భర్త దగ్గరకొచ్చి కుర్చీలో కూల బడింది భారతి.

రెండు నిముషాలు అలా కళ్లు మూసిందో, లేదో కొడుకు, కోడలు మనవలూ 'బలబిల'మంటూ వచ్చేసేరు.

'అమ్మా! మేము టి ఫిన్లు చేసేసాం! ఆ కళ్లు లేవు! మీరు భోజనాలు చేసేయండి.' అని అడుగుపెడుతూనే అన్నాడు మోహన్.

తల్లి ప్రాణం గిలగిల లాడింది. 'మెంతి వంకాయకూర అలాగే వదిలేసి భోజనాలు అయ్యేయనిపించేరు ఆ దంపతులు.

భోజనానంతరం "మన ఊరు చూడాలని ఉందిరా! రేపు ఉదయమే, మా ప్రయాణం!" అని తన నిర్ణయం చెప్పేడు స్వరాజ్యమూర్తి.

'అదేంటి? నా వల్ల ఏదయినా పొరపాటు జరిగిందా! ఇంత సడన్‌గా ప్రయాణం ఏమిటి? 'నిర్ఘాంత పోతూ అడిగేడు మోహన్.

'అలాంటిదేమీ లేదర్రా! ఈ వయసులో ఊరిమీదకు మళ్లిన మనసుని అదుపు చేయలేను! చాలాటైమయింది. పడుకుందాం!" అని అంటూ లేచేడు స్వరాజ్యమూర్తి.

'విజయా! వాళ్ల ప్రయాణం ఖాయం. ప్రయాణానికి ఏర్పాటు చెయ్యి. అంటూ బెడ్‌రూము వైపు నడిచేడు మోహన్.

●●●

'లోకసాక్షి' లోకాన్ని చుట్టి రావడానికి బయల్దేరి అప్పుడే మూడు జాములు దాటింది. మోహన్ ఆదరాబాదరాగా రిక్షా దిగేడు. ఇంటి అరుగుమీద కూర్చున్న మనిషిని చూసి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయేడు. తేరుకుని,

'నువ్వా మామయ్యా! నువ్వొచ్చి ఎంత సేపయింది?' అని తాళం తీస్తూ అడిగేడు.

'ఇప్పుడే! ఒక గంటయిందిరా! ఇంటికి తాళం వేసి ఉంటే పక్క వాళ్లని అడిగేను. 'ఆస్పత్రికి వెళ్లేరని చెప్పేరు. ఇలా కూలబడ్డాను. మీ ఇంట్లో ఎవరికి బాగోలేదురా?' అని అడుగుతూ తన పెట్టె పట్టుకుని మోహన్ వెంట లోపలికి నడిచేడు ఆయన.

'మూడు రోజుల్నుండి విజయకి కడుపునొప్పి వస్తోంది.తగ్గడంలేదు. హాస్పిటల్‌కి తీసుకు వెళ్తే, టెస్టులు చెయ్యాలి హాస్పిటల్‌లో జాయిన్‌చేయమన్నారు. నిన్ననేజాయిన్ చేసేను. అప్పట్నుండి పిల్లలు వంట క్యారేజీలతో కుస్తీపడుతున్నాను.'

'నేను వచ్చేసాగా! ఇంక నీకా అవసరం లేదులే! నేను అన్నీ చూసుకుంటాను. నువ్వు నిశ్చింతగా ఉండు?' అని మోహన్ ధైర్యం చెప్పి,

'వంటగది అదేకదురా అబ్బాయ్!' అని అంటూ వంట గదివైపు దారి తీసేడు, మామయ్య.


మోహన్ కళ్లల్లో నీటి తెరలు ఏర్పడ్డాయి. తన పరిస్థితి తెలుసుకుని, జాలిపడి, దేముడే 'మావయ్య' రూపంలో వచ్చేడా?' అని అనుకుంటూ వంటగదిలోసామాన్లు అందించడానికి ఆయన వెనకే నడిచేడు.

'ఒరేయ్! ఆ పాటి నేను తీసుకోగలనులే! నువ్వు బాగా అలసి పోయినట్లున్నావ్, వెళ్ళి కొంచెంసేపు రెస్టు తీసుకో!' అని అంటూ పంచె- లాల్చీ అవతారంలో నుండి లుంగీ- బనీను అవతారంలోకి మారిపోయేడు మావయ్య. 'అలాగే' నంటూ అలంసిపోయిన శరీరాన్ని మంచం మీద వాల్చేడు, మోహన్.

మావయ్య చాలా చిత్రమయిన వ్యక్తి, ఏ క్షణంలో, ఎక్కడ ప్రత్యక్షమవుతాడో తెలియదు. వచ్చిన దగ్గర్నుండి ఆ ఇంట్లోని మనుషుల మనసుల్ని ఆకట్టుకుంటాడు, తండ్రికి స్నేహితుడు కావడంతో చిన్నప్పట్నుండి మావయ్య గురించి తనకు బాగా తెలుసు.

అందరికీ ఆయన 'మావయ్య' ఎలా అవుతాడు అనే సందేహం చిన్నప్పుడు తనకి కలిగింది. అదే మాట ఆయనని అడిగితే ఆ వెన్నెలరాత్రి ఆకాశంలో చంద్రుడ్ని చూపిస్తూ 'ఆయన అందరికీ 'చందమామ' కదురా! అలాగే నేను కూడా! అని చెప్పేడు.

'ఒరేయ్! వంట పూర్తయ్యింది!' అన్న మాటకి లేచి వంటింట్లోకి వెళ్లి, ఆవురావురు మంటూ కంచం ముందు కూర్చున్నాడు. మామయ్య చేసిన రుచికరమయిన వంటకాలతో చాలా రోజుల తరువాత తృప్తిగా భోజనం చేసేడు.




'ఒరేయ్! అమ్మా నాన్నా నీ దగ్గరే ఉండాలి కదా! కనవడరేం?' అడిగేడు మామయ్య.

'నెలరోజులకిందట నాన్న మా ఊరు వెళ్లి పోతామన్నారు. వెళ్లిపోయేరు. ఆరోజు నుండి దిక్కూ, దివాణం లేని కొంప అయి పోయింది. మాది! 'బాధగా చెప్పేడు మోహన్.

"ఏమయినా తగాదా పడ్డారా?" 'నెమ్మదిగా అడిగేడు మావయ్య.

'అదేం లేదు. అమ్మా నాన్నా, ఈ వాతావరణంలో ఇమడలేకపోయారనుకుంటాను ఆయన గట్టిగా చెప్తే ఎవరు కాదంటారు. వాళ్లు వెళ్లిపోయాక ఏర్పడిన స్తబ్దత, నిరాకతో పారి పోయింది. 'అని తన మనసులోని ఆనందాన్ని బయటపెట్టేడు మోహన్.

ఆరోజు సాయంత్రం పిల్లల్ని తీసుకుని మోహన్ వద్దంటున్నా వినకుండా హాస్పిటల్‌కి బయల్దేరేడు మామయ్య.

మావయ్యని చూడడంతో విజయ ఇంటికి వచ్చేసింది. 'సంతోషం సగం బలం!' అని అందుకే అంటారు కాబోలు.

ఒకరోజు బయల్దేరిపోతానన్నాడు. మావయ్య! అందరి మొహల్లో చీకటిచారలు తొంగిచూసేయ్. అయినా ఆయన్ని ఆపడం సాధ్య కాదు కనుక మొహాలకునవ్వులు పులుముకొని అందరూ మావయ్యకు వీడ్కోలు చెప్పేరు.

●●●

సంధ్యా సమయంలో ఏదో తెలియని నిరాసక్తతతో నిట్టూరుస్తూ స్వరాజ్యమూర్తి కుర్చీలోనుండి లేచి దేముడి దగ్గర భార్య ఉంచబోయే సంధ్యాదీపపు కాంతి ని చూద్దామని వరండాలో నుండి ఇంట్లోకినడవబోయేడు.

ఎదురుగా వెలుగు కనిపించింది, స్వరాజ్యమూర్తికి, 'ఒరేయ్, నువ్వా! ఎన్నాళ్లకి కనిపించేవురా? ' అని అంటూ సరుగులాంటి నడకతో వెళ్లి ఆమనిషిని గాఢాలింగనం చేసుకున్నాడు స్వరాజ్యమూర్తి

'భారతీ మావయ్య వచ్చేడే!' అని ఆనందంగా కేకేసేడు అప్పుడే దేముడికి దీపం పెట్టిన భారతి హడావిడిగా బయటకు వచ్చింది.

'కాళ్లు కడుక్కో మావయ్యా!' అంటూ చెంబుతో నీళ్లు అందించింది. కాళ్లు కడుక్కుని, వరండాలో కుర్చీలో కూర్చున్నాడు మావయ్య. చెంబుతో మంచినీళ్లు. అందించింది భారతి.

'అతిథి మర్యాదలు చెయ్యడానికి నేనేమయినా పరాయి వాడ్నిటమ్మా! 'నవ్వుతూ అన్నాడు మావయ్య,

ఆత్మీయులకి ఏమీ ఇవ్వకూడదా అన్నయ్యా! మీరు మాట్లాడుకుంటూ ఉండండి! నేను వంటపూర్తి చేస్తాను' అని అంటూ వంటింటి వైపు దారితీసింది భారతి.

ఏమిరా ఎక్కడనుండిరా? అమెరికానుండా, అండమాన్నుండా? 'సరదాగా అడిగేడు స్వరాజ్యమూర్తి.

'అబ్బాయి దగ్గరనుండి!'

'అంటే'... సంభ్రమంగా అడిగేడు స్వరాజ్యమూర్తి

'అదేన్రా, మోహన్ దగ్గర్నుండి ఉదయం బయల్దేరేను.'

మావయ్య మాటలు వినిపించి అతృతగా లోపల్నుండి వచ్చి 'కోడలు, పిల్లలు కులాసాగా ఉన్నారా 'అని అడిగింది భారతి.

'ఆ! కులాసాగానే ఉన్నారు. కానీ మీ గురించి బెంగపెట్టుకున్నట్టు మీ మనవలు కనిపించేరు' నిగూఢంగా చెప్పేడు మావయ్య.

పైట చెంగుతోకళ్లు వత్తుకుంటూ లోపలకు వెళ్లిపోయింది భారతి. ఆ కబురూ, ఈకబురూ చెప్పుకుంటూ, చిన్ననాటి విషయాలు ముచ్చటించుకుంటూ భోజన కార్యక్రమం' అయిన తరువాత స్నేహితులిద్దరూ, అరుబయట మంచాలు వేసుకుని పడుకున్నారు. భారతి వీధి అరుగు మీద చాపవేసుకుని నడుం వాల్చింది.ఆమె మనసు వాళ్ల మాటలమీద లగ్నం అయింది.

'స్వరాజ్యం! ఇక్కడ ఎలాగుందిరా?' అడిగేడు మావయ్య.

'నిక్షేపంలా ఉంది. ప్రశాంత వాతావరణం చీకూ చింతా లేదు. జీవిత చరమాంకంలో ఇంకేం కావాలిరా? అప్పుడప్పుడు అబ్బాయి గురించి ఆలోచన వస్తుందిరా, తప్పుదుకదా! ' సాలోచనగా అన్నాడు, స్వరాజ్యమూర్తి.'

'స్వరాజ్యం! ప్రకృతి అందాలు దాచడం ఎంత అసాధ్యమో, మానవ ప్రకృత సిద్ధమైన హృదయ స్పందనలు కూడా దాచడం సాధ్యం కాదురా! నేను ఒక మాట అడగనా?' అడిగేడు మావయ్య

'నువ్వు అడగక్కర్లేదు. నేనే చెప్తాను. మేము అక్కడ ఉంటే వాళ్లకు 'స్వేచ్ఛ' లేదు. మాకు స్వతంత్రం లేదు వాళ్లు బాధపడతారని మేము, మా దగ్గర భయంతో వాళ్లు స్వేచ్ఛ నిచంపుకుని సహజీవనం సాగించవలసి వచ్చేది. స్వతంత్ర జీవనానికి అలవాటు పడ్డ నేను అది భరించలేకపోయాన్రా!"

మావయ్య లేచి, మంచం మీద కూర్చున్నాడు.

"ఒరేయ్! అసలు స్వేచ్ఛ స్వతంత్రం అంటే ఏమిట్రా"?

'నువ్వడిగింది బాగుందిరా. చిన్నపిల్లాడిని పౌరశాస్త్రం అడిగినట్లు అడుగుతున్నావ్, మన భావాల్ని నిర్భయంగా బయట పెట్టడం మనకి కావలసిన రీతిలో బతకడం, అదేన్రా నేననుకునే స్వేచ్ఛ, నేనాశించే స్వతంత్రం,' నవ్వుతూ అన్నాడు. స్వరాజ్యమూర్తి 'పరాయివాళ్ల పాలనలో, ఆ రెండూ, మనకుండేవా? 'తిరిగి అడిగేడు.

'లేవు ఉండవు. ఆంగ్లేయులపాలనలో మనకి దాస్యం తప్పలేదు. అందుకే గాంధీ, నెహ్రూ, తిలక్, గోఖలే, బోస్ లాంటి మహానుభావులు దేశస్వాతంత్ర్యంకోసం, వాళ్ల జీవితాల్ని త్యాగం చేసేరు. మనకి స్వతంత్రం సంపాదించేరు." అయితే మీ వాడి పాలనలో ఆ ఛాయలేమయినా నీకు కనిపించేయా? 'మావయ్య అడిగిన మాటకు నిరుత్తరుడయి పోయేడు స్వరాజ్యమూర్తి.

'అహ! అదేంలేదురా?' అన్నాడు తేరుకుని.

'మరెందుకురా వాళ్ల దగ్గర్నుండి వచ్చేసేవు. నువ్వు బాధపడడానికి వాళ్లని బాధపెట్టడానికి కాకపోతే."

'కాదురా! వాళ్ల సినిమాలు, షికార్లు. అర్ధరాత్రి వరకు టి.వి. గోల నాకునచ్చ లేదురా!'

'ఆ మాట వాడితో అన్నావా!'

'వాళ్ల స్వేచ్ఛకి అడ్డుతగలడం ఇష్టం లేదురా!"

నీ స్వేచ్ఛ తగలెయ్యా! సాటిమనుషుల్ని దూరంచేసేదేనా స్వేచ్ఛంటే అయిన వాళ్లని కాదనేదేనా స్వేచ్ఛంటే! మనుషుల్ని అర్థం చేసుకోకపోవడమేనా స్వేచ్ఛ అంటే? ప్రతి వాడికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్నాయి. కానీ వాటికీ ఒక హద్దుఉందిరా! నీ స్వతంత్రం' ప్రారంభమయ్యే చోట, నా 'స్వేచ్ఛ' ని త్యాగం చెయ్యాలి. అప్పుడేరా, 'సహజీవనం' సాధ్యం అవుతుంది. మనుషుల్లో మానవత్వాన్ని 'సమాధి' చేసి 'మం 'మనుషులు'గా మార్చే నీ 'స్వేచ్ఛ' కంటే ప్రేమ తత్వానికి కట్టుబడి, ఇతరులనిప్రేమిస్తూ వాళ్ల హృదయాంతర్గత మయిన ప్రేమ పంజరంలో బందీగా ఉండడమే మంచిదిరా. అందుకే సర్దుబాటు ధోరణి అలవరుచుకోవాలి. ఎదుటి మనసుని గుర్తించని నాడు మనిషే ఉండదు. ఈ సమాజం శూన్యంగా ఉంటుంది' అవేశంగా చెపుతూ ఆగేడు మావయ్య.

'స్వరాజ్యం! జరిగిపోయిన దానికి బాధపడి ప్రయోజనం లేదురా! నేను కూడా, ఒకప్పుడు మూర్ఖంగా ఆలోచించి అనుకూలవతి అయిన అర్ధాంగిని ఇంట్లోంచి గెంటేస్నేను."

'అదేమిత్రా! నేను విన్నది వేరు. మీ ఆవిడ డబ్బున్న వాళ్ల అమ్మాయి అని అహం కారంతో, నిన్ను కాదని వెళ్లిపోయిందని విన్నానే,' ఆశ్చర్యంగా అడిగేడు స్వరాజ్యమూర్తి.

'అదే రా! లోకం తీరు. ఎవరు అనువుగా ఉంటే వాళ్లదే తప్పంటుంది. తడి, మడి అంటూ పూజలూ వ్రతాలూ చేసే మా ఆవిడ్ని, మారానంది. నాలో అహం దెబ్బతింది.

'అలా అయితే నీకూ, నాకూ సంబంధంలేదు. మీ పుట్టింటికి ప్రయాణంకట్టు! 'అని పుట్టింటి దగ్గర విడిచేసేను. ఆవేశం చప్పుడు అణగారిపోయిన తర్వాత, ఆమెతో నేను గడిపిన జీవితంలోని మధుర స్వరాలు వినపడసాగేయ్. రెండేళ్ల తరువాత ఆమెని తీసుకురావడానికి వెళ్లేను. కాని నామీద అభిమానం వదలేక ఆఅభిమానవతి ఈ లోకాన్నే వదిలిపోయింది. నా మీద కోపంతో వాళ్ల వాళ్లు ఆ 'విషయం నాకుతెలియపరచలేదు.

కొన్నేళ్లు పిచ్చివాడిలా తిరిగేను చివరికి మార్గం కనిపించింది 'సాటి వాళ్లు, నావాళ్లు కాదూ! వాళ్ల అవసరాల్ని గమనిస్తూ 'వాళ్ల గుండె గదుల్లో 'బందీగా ఉండా లని నిశ్చయించుకున్నాను. అదే నా జీవిత మార్గంగా ప్రయాణం చేస్తున్నాను."

'చాలురా! నీ జీవితపులోతు నా జీవితపు అంచు నుండి చూస్తుంటే కళ్లు తిరుగు తున్నాయ్' అని అన్నాడు స్వరాజ్యమూర్తి.

మర్నాడు...

'నువ్వు మాతో వచ్చేయరా!' అని అంటున్న స్వరాజ్యమూర్తికి.

'నేను ఒక చోట ఉండిపోతే ఎలా! నేను అవసరమయిన చోటుకి వెళ్లాలి!' అని అంటూ, కొడేకుడు దగ్గరకి బస్సు ఎక్కిన దంపతులకి నవ్వుతూ వీడ్కోలు చెప్ప సాగేడు మావయ్య!

* * *

